
తాళ్లపూసపల్లి సమీపంలో లోకోమోటివ్ పీవోహెచ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న రైల్వే భూమి

'లోకోమోటివ్ పీవోహెచ్' ఇవ్వండి



జిల్లా ప్రజల డిమాండ్

మహబూబాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వివక్షకు గురైన గిరిజన ప్రాబల్య మహబూబాబాద్ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. దశాబ్దం కిందట నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్‌తో ఏర్పడిన తెలంగాణలో విభజన చట్టం కింద ఉన్న బయ్యారం ఉక్కు ఆశలు నేటికీ నేరవేరలేదు. తాజాగా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో మహబూబాబాద్ జిల్లాలో దాదాపు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే రైల్వే లోకోమోటివ్ పీవోహెచ్ తెరపైకి వచ్చింది. తెలంగాణ ప్రజాప్రతినిధులు పట్టుబడితే ఈ లోకోమోటివ్ పీవోహెచ్ ఏర్పాటుకు కావాల్సిన స్థలం కూడా మహబూబాబాద్ జిల్లాలోని తాళ్లపూసపల్లి, పూర్వకాలంలో పేరు గడించిన డోర్నకల్ రైల్వే జంక్షన్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి రైల్వే పరిధిలోనే ఉందని అధికారులు చెబుతున్నారు. ఆ దిశగా పాలకులు స్పందించాలని, యువతకు ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టును మంజూరు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో గిరిజన ప్రాబల్య మహబూబాబాద్ ప్రాంతం అభివృద్ధికి ఊతం కల్పించినట్టవుతుందని ఆశపడుతున్నారు.

లోకోమోటివ్ పీవోహెచ్ ఏర్పాటు చేయాలంటే..

దక్షిణమధ్య రైల్వేలో పూర్తిస్థాయి లోకోమోటివ్‌లకు (రైలు ఇంజన్) పిరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీవోహెచ్) షెడ్లు ఇప్పటి వరకు లేవు. లోకో మోటివ్ పీవోహెచ్ ఏర్పాటు చేయాలంటే కనీసం జోన్ పరిధిలో 800 లోకోలు ఉంటే వాటి మెయింటెనెన్స్ కోసం పీవోహెచ్ ఏర్పాటు చేస్తారు. దక్షిణ మధ్య రైల్వేపరిధిలో 1,144కు పైగా లోకోలున్నాయి. అందులో విజయవాడ (బీజెడ్‌ఏ)లో 262, లాలగూడ ఎలక్ట్రిక్ లోకోషెడ్డులో 293, కాజీపేట ఎలక్ట్రిక్ లోకోషెడ్డులో 210, గుత్తి డిజిల్ షెడ్డులో 90, కాజీపేట డీజిల్‌షెడ్డులో 85, గుంతకల్లు షెడ్డు 160, మౌలాలి షెడ్డులో 44 మొత్తం 1144 లోకోమోటివ్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీవోహెచ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దక్షిణమధ్య రైల్వేలో 1,144లకు పైగా లోకోమోటివ్‌లు ఉన్నా పీవోహెచ్ వర్క్‌షాప్ అందుబాటులో లేకపోవడంతో ఈ డిమాండ్‌కు బలం చేకూరుతుంది. నూతనంగా లోకోమోటివ్ వర్క్‌షాపు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్నట్టు సమాచారం.

దక్షిణమధ్య రైల్వేలో.. మానుకోట..

దక్షిణ మధ్య రైల్వేలో సెంట్రల్ పాయింట్‌లా ఉన్న మహబూబాబాద్‌తో పాటు ఇదే జిల్లా పరిధి సరిహద్దులో ఉన్న డోర్నకల్‌లలో ఎక్కడైనా ఈ వర్క్‌షాపు ఏర్పాటు చేస్తే అన్నింటికి అనుకూలంగా ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. గ్రాండ్ ట్రంక్ మార్గమైన చెన్నై నుంచి న్యూఢిల్లీ, భువనేశ్వర్ నుంచి ముంబై పట్టణాలను కలిపే ప్రధాన రైలుమార్గం

మిగతా 8వ పేజీలో...

- ఏర్పాటుకు అనుకూలంగా రెండుచోట్ల రైల్వే భూములు
- ప్రధాన నగరాలను కలిపే రైల్వేమార్గం మానుకోటే..
- ఏర్పాటు జరిగితే దాదాపు 10 వేల మందికి ఉపాధి
- కేంద్రసర్కారు స్పందిస్తే గిరిజన ప్రాంత అభివృద్ధికి ఊతం

లోకో మోటివ్ ఓవర్ హోలింగ్‌కు అవకాశం..

పీవోహెచ్ అంటే పిరియాడిక్ ఓవర్ హాలింగ్ ఇది లోకోమోటివ్‌ల (రైలు ఇంజన్) నిర్వహణకు ఉపయోగపడుతుంది. పీవోహెచ్‌లో రైలు ఇంజన్‌కు పలు మరమ్మతులు చేస్తారు. లోకోమోటివ్‌లలో ప్రధాన భాగాలైన క్యామ్‌షాఫ్ట్‌లు, క్రాంక్ షాఫ్ట్‌లు, పిస్టన్‌లు, కనెక్టింగ్ రాడ్, సిలిండర్ హెడ్‌లను శుభ్రం చేస్తారు. వాటిని పరీక్షించి కాలం చెల్లిన వాటిని పూర్తిగా తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని అమరుస్తారు. ఇంజన్‌కు నీటిని సరఫరా చేసే పైపులైన్లు, వాల్వ్‌లు, రోలర్‌బేరింగ్స్, ఆయిల్‌సీల్స్, సీల్‌అండ్ గ్యాస్‌కెట్, ఫౌండేషన్‌బోర్డులను అమరుస్తారు. ఎలక్ట్రికల్ లోకోమోటివ్‌ల కోసం పీవోహెచ్ యొక్క అవర్తన వ్యవధి 18 సంవత్సరాలుగా ఉంటుంది. లోకో తిరిగిన దూరం 24 లక్షల కిలోమీటర్లు వీటిలో ఏదీ ముందయినా లోకోమోటివ్‌లను పూర్తిగా మరమ్మతు చేస్తారు.

పిరియాడిక్ ఓవరలింగ్ వర్క్‌షాపు ఏర్పాటు చేయాలి

యుగంధర్ యాదవ్, మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ



న్యూఢిల్లీ నుంచి చెన్నై, భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్లేందుకు ప్రధాన రవాణా రైల్వే మార్గం కలిగిన మహబూబాబాద్‌లో లోకో మోటివ్ (పీవోహెచ్) ఏర్పాటు చేయడం వల్ల స్థానిక గిరిజన ప్రజలకు ఉపాధి అవకాశం మెరుగుపడుతుంది. కావున లోకో మోటివ్ పిరియాడిక్ ఓవరలింగ్ వర్క్‌షాపు ఏర్పాటు చేయాలి.

పీవోహెచ్ యూనిట్ ఏర్పాటుకు డోర్నకల్ అనువైన ప్రాంతం

మైనూపాషా, డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు, డోర్నకల్



ఇల్లందు పరిసర ప్రాంతాల్లో బొగ్గు నిక్షేపాలు కనుగొన్న తర్వాత బొగ్గు తరలించడానికి డోర్నకల్ మీదుగా అప్పటి నిజాం ప్రభుత్వం రైల్వేలైన్ నిర్మాణం చేపట్టింది. 1888లో డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం విజయవాడకు రైల్వేలైన్ నిర్మించారు. దీంతో డోర్నకల్ రైల్వే జంక్షన్ అయింది. తర్వాత జంక్షన్‌లో స్టీమ్ ఇంజన్ లోకోషెడ్‌తో పాటు వ్యాగన్ మరమ్మతుల కేంద్రం సహా రైళ్ల నిర్వాహణలో ముఖ్యమైన 12 రకాల విభాగాలు నెలకొల్పారు. కాలక్రమంలో వీటన్నింటిని డోర్నకల్ నుంచి తరలించారు. ప్రస్తుతం డోర్నకల్ జంక్షన్‌లో 18 రైల్వేలైన్లున్నాయి. అలాగే పీవోహెచ్ యూనిట్ ఏర్పాటుకు సరిపడా రైల్వే భూములున్నాయి. ఈ విషయంపై గతంలో రైల్వేమంత్రిగా ఉన్న పీయూష్‌గోయల్‌కు వినతిపత్రం సైతం అందించాం.


గూడూరులో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మురళీనాయక్, విమలక్క, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, కొమురయ్య వారసుడు చంద్రం

కురుమలు కష్టాన్ని నమ్ముకున్నోళ్లు

- రజాకార్లను ఎదిరించిన యోధుడు దొడ్డి కొమురయ్య
- ఆయన పేరు శాశ్వతంగా గుర్తుండేలా చర్యలు తీసుకుంటాం
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- గూడూరులో కొమురయ్య విగ్రహావిష్కరణ

7


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- కక్షపూరితంగా నిర్మాణాన్ని ఆలస్యం చేశారు..
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆస్పత్రిని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

7

రాష్ట్రంలో సంక్షేమ పాలన : కోరం

బయ్యారం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో సంక్షేమ పాలన సాగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం బయ్యారంలో ఆయన పర్యటించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించే ఇందిరమ్మ ఇంటి (మోడల్ నమూన) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ విజయ, ఎంపీడీవో విజయలక్ష్మీ, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

29న జరిగే రాత పరీక్షను రద్దు చేయాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29న జరిగే రాత పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వైద్య, ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకురాలు నసీమాబేగం మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్ఎంలకు రాత పరీక్షతో సంబంధం లేకుండా రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్‌కు వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో స్నేహలత, అశ్వినీ, పార్వతి, వనిత పాల్గొన్నారు.

27, 28న జీపీ కార్మికుల సమ్మె బాట

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 27, 28 తేదీల్లో సమ్మె బాట పట్టనున్నట్లు కార్మికుల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో డీపీవో హరిప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వ పరిష్కరించని పక్షంలో జనవరి 4 వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, యూసప్, అరుణ్‌కుమార్, వెంకటయ్య, దాసు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా పని చేద్దాం.. మానుకోటను అభివృద్ధి చేసుకుందాం

- మునిసిపాలిటీ భవనం త్వరగా పూర్తయ్యేలా చర్యలు
- గృహాలు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


మానుకోట మునిసిపల్ పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా పని చేస్తూ.. మానుకోట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మునిసిపల్ పాలకమండలి సాధారణ సమావేశం చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.మూడుకొట్ల జంక్షన్ వివక్షతకు గురైందని, దాని అభివృద్ధికి తన నిధుల నుంచి రూ.15 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఎన్టీఆర్ స్టేడియం రహదారి విస్తరణ పనులు నత్తనడకన నడుస్తున్నాయని, దానిని వేగవంతం చేయాలని సూచించారు. మునిసిపల్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్‌లో అసంపూర్తిగా మిగిలిన పనులు పూర్తి చేసేందుకు రూ.95లక్షలు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు.

మహబూబాబాద్ ఔటర్ రింగురోడ్ (ఓఆర్ఆర్) గూర్చి ప్రభుత్వంతో చర్చించానని, రెండేళ్లలో ఆ కల నెరవేరబోతుందని మురళీనాయక్ వివరించారు. వైద్య కళాశాల భవన నిర్మాణం ఆలస్యం కావడంతో మెడికల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి నిరుపేదకు పార్టీల కతీతంగా ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వం మునిసిపల్ చట్ట సవరణలో తీసుకువచ్చిన మునిసిపల్ కౌన్సిలర్ల హక్కులను నిర్వీర్యం చేసే సెక్షన్ 66ను తొలగించే విధంగా అసెంబ్లీలో చర్చిస్తానని తెలిపారు. మిషన్ భగీరథ పనుల కోసం రూ.20కోట్లు తీసుకువచ్చామని, ఆ పనులూ త్వరలోనే ప్రారంభ మవుతాయని చెప్పారు.

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

-ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ పట్టణ శివార్లలో నిరుపేదలు

మిగతా 8వ పేజీలో...

వైన్స్ షాప్‌లో చోరీ

తొర్రూరు, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): తొర్రూరులోని భద్రకాళి వైన్స్‌లో దొంగతనం జరిగింది. వైన్స్ నిర్వాహకులు, పోలీసులు తెలిపిన ప్రకారం. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పట్టణంలోని మార్కెట్ ఏరియా మెయిన్ రోడ్‌లో ఉన్న భద్రకాళి వైన్స్ పైకప్పు పెంకులు తొలగించిన దొంగ షాపులోనికి ప్రవేశించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. అనంతరం క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.20వేల నగదుతో పాటు సుమారు రూ.లక్ష విలువైన ఖరీదైన మద్యం బాటిళ్లను కూడా ఎత్తుకెళ్లాడు. లోపలికి వచ్చిన వ్యక్తి కాకుండా మరో ఇద్దరు బయట ఉండవచ్చని నిర్వాహకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకుని వివరాలు సేకరించారు. వైన్స్ నిర్వాహకుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- వినతులను అధికారులు పెండింగ్‌లో పెట్టొద్దు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


గ్రీవెన్స్‌లో ఫిర్యాదును స్వీకరిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 117వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా తమ పరిధిలో ఉన్న వాటిని అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్‌పై ఎంతో నమ్మకంతో దూరప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై వినతులను అందిస్తారని, సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి, పరిష్కారం చూపాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి, అధికారులు వెంకటేశ్వర్లు, పురుషోత్తం, నర్సింహాస్వామి, మధూసూదన్‌రాజు, రవీందర్‌రెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, నర్సింహామూర్తి, హరిప్రసాద్, వేముల సురేష్, సైదానాయక్, కృష్ణవేణి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి ఇండస్ట్రియల్ ప్రమోషన్ (డీఐపీపీ) కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ టీ-ప్రైడ్ స్కీమ్ ద్వారా జిల్లాలోని షెడ్యూల్ ట్రైబ్ (ఎస్టీ) 31 మందికి రూ.95,61,860, షెడ్యూల్ క్యాస్ట్ (ఎస్సీ) ఐదుగురికి రూ.15,89,506, మొత్తంగా రూ. 1,11,51,366 నిధుల కేటాయింపు కోసం కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 36 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సబ్సిడీ రుణాల ప్రతిపాదనలు పంపామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పీఎం. విశ్వకర్మ, టీ ప్రైడ్ తదితర సౌకర్యాల ద్వారా జిల్లాలోని యువతీ, యువకులు వ్యాపార రంగాల్లో ప్రవేశించి ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, పౌల్ట్రీ పరిశ్రమ, రైస్ మిల్లు, జేసీబీ, లారీలు, చిల్లి వ్యాపారం తదితర వాణిజ్య వ్యాపారాలున్నాయని ప్రజలు వాటిని ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ. సత్యనారాయణ, అధికారులు సైదానాయక్, శ్రీనివాస్, సత్యనారాయణ, సాయిచరణ్, మూర్తి పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీ..

మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వఆస్పత్రిని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని డయాలసిస్, ఫార్మసీ, ఇన్‌పేషేంట్‌ల వార్డులు, సాధారణ వార్డులు తిరుగుతూ చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే ప్రతీ ఒక్కరికి వైద్య చికిత్సలు అందించాలని, రోగులను ఆప్యాయతగా చూసుకుంటూ వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఆస్పత్రిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో జగదీష్, అడ్మినిస్ట్రేటివ్‌ఆఫీసర్ గఫార్ పాల్గొన్నారు.


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగయ్య


మాట్లాడుతున్న మైస నాగయ్య

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెం టనే పరిష్కరించాలనివిశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖలో 20ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తున్నప్పటికీ సర్కారు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. చాలీచాలని వేతనాలతో పాఠశాలల బలోపేతంలో పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచి, వారికి ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. విద్యాశాఖలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘీభావం ప్రకటించిన వారిలో సోమయ్య, వెంకటయ్య, నాగేందర్ ఉన్నారు. ఈ సమ్మెలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు వీరన్న, భాస్కర్, ఉదయ్, బాబులాల్, రవీందర్, వీరస్వామి, గణేష్, సాగర్, నవీన్, సరస్వతి, నీలిమా, షేక్‌మున్నీ, శైల జ, ఉషారాణి, సుమలత, శ్రవంతి, స్వర్ణలత, సుని త, రాజశ్రీ, కల్పన, ప్రభావతి, విజయలక్ష్మీ, కవిత, అరుణ పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మార్కెట్ చైర్మన్ శివరాజ్, ఆర్డీవో గోపిరామ్

జనగామ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రీ క్రిస్మస్ వేడుకలను జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, ఆర్డీవో గోపిరామ్ హాజరై కేక్ కట్ చేశారు. ప్రభుత్వం అన్ని కులాలు, మతాలకు సముచితం స్థానం కల్పించి, వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.

కడియంను కలిసిన కబడ్డీ అసోసియేషన్



కడియం శ్రీహరిని కలిసిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 30 వరకు జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి రావాలని సోమవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జనగామ జిల్లా కబటీ అసోసియేషన్ బాధ్యులు హన్మకొండలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పోగుల సారంగపాణి, అధ్యక్షుడు వై.కుమార్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాస్ యాదవ్, తోటకూరి గట్టయ్య, తోటకూరి వెంకటేశ్వర్లు, అన్నెపు కుమార్, సీహెచ్ సుధాకర్ తదితరులు కడియంను కలిసిన వారిలో ఉన్నారు.

మార్కెట్‌లోనే కందులను విక్రయించాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి కందులను పండించిన రైతులు దళారులకు విక్రయించి నష్టపోకుండా మార్కెట్‌లోనే విక్రయించి మద్దతు ధరలను పొందాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య రెడ్డి సూచించారు. సోమవారం మార్కెట్ ఆవరణలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటా కనీస మద్దతు ధర రూ.7,550 ఉండగా ఓ రైతు తీసుకువచ్చిన కందులకు ట్రేడర్ క్వింటా రూ.8,711 వేలం పాడి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, సెక్రటరీ జన్ను భాస్కర్, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, డైరెక్టర్లు భాస్కుల కిరణ్, ఇల్లెందుల బాబు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్, ప్రతినిధులు

జఫర్‌గఢ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థుల విద్యాప్రగతి కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) పోరాటం సాగిస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ అన్నారు. సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను సోమవారం హిమ్మత్‌నగర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో ఆవిష్కరించి మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ సందర్భంగా ఈనెల 28 నుంచి 30 వరకు నల్గొండలో పెద్దఎత్తున మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న భారీ ర్యాలీ, బహిరంగ సభ, 29, 30 తేదీల్లో ప్రతినిధుల సభలు, చర్చ, వివిధ వక్తలచే ఆలోచనాత్మక ప్రసంగాలు ఉంటాయన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వంశీకృష్ణ, ఉపాధ్యాయులు జితేందర్, కవిత, వనజాత పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలి

- రైతులు వ్యవసాయ అనుబంధ రంగాల వైపు దృష్టి సారించాలి
- అటారి డైరెక్టర్ జోన్-10 షేక్‌మీరా
- మల్యాలలో ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



జాతీయ రైతు దినోత్సవంలో రైతులను సన్మానిస్తున్న షేక్‌మీరా, మాలతి

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు రైతులు కృషి చేయాలని అటారి డైరెక్టర్ జోన్-10 షేక్ మీరా సూచించారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మట్టి పరీక్ష కేంద్రం, సమీకృత వ్యవసాయ పాఠశాల కేంద్రాన్ని ప్రాంతీయ పీజేటీఏయూ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ జమునరాణి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మధ్య తెలంగాణ సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీరా మాట్లాడుతూ వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే విధంగా వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల వైపు దృష్టి సారించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసుకోవాలని, యాంత్రీకరణ వైపు రైతులు దృష్టిసారించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. యువశాస్త్రవేత్తలు అన్నివేళలా రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

తెలంగాణ సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడి మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని, పంట మార్పిడి చేయాలని, సమీకృత వ్యవసాయం మంచి నాణ్యమైన రకాలను సాగు చేసి అధిక దిగుబడి పొందాలన్నారు. టీజేటీఎస్‌ఏయూ డీఈ జమునరాణి మాట్లాడుతూ రైతులు కష్టం వల్లే దేశంలో ఆహారభద్రత ఉందని తెలిపారు. ప్రిన్సిపల్ సైంటిస్టు వెంకన్న మాట్లాడుతూ యాసంగిలో సాగుచేసే వరిరకాల వివరాలను వివరించారు. అంతేకాకుండా అధిక సాంద్రతతో పత్తి సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే పరిశోధన స్థానం సమన్వయకర్త మాలతి, ప్రిన్సిపల్ సైంటిస్టు వీరన్న, శాస్త్రవేత్తలు ఎన్.కిశోర్‌కుమార్, రాంబాబు, క్రాంతికుమార్‌తో పాటు జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల, ఉద్యానవన అధికారి మరియన్నతో పాటు మహబూబాబాద్, మరిపెడ ఏడీఏలు శ్రీనివాసరావు, విజయచంద్ర, రైతులు గోపాల్‌రెడ్డి, యాదగిరి, కృష్ణారెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

కొడుకు మరణం తట్టుకోలేక ఆగిన తల్లి గుండె



రామక్క (ఫైల్)

చిలుపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో కన్నకొడుకు మృతి చెందడంతో మనోవేదనకు గురైన ఆ తల్లి కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే గుండె పోటుకు గురై తనువు చాలించింది. ఈ ఘటన మండలంలోని వంగాలపల్లిలో సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆవుల కన్నయ్య(37) పాలు విక్రయించడం కోసం వెళ్లి ఈనెల 15న హన్మకొండ నిట్ కళాశాల ఎదుట రోడ్డు క్రాస్ చేస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ డెడ్ కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అతని అవయవాలను 19న దానం చేశారు. కొడుకు అకాల మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన అతని తల్లి ఆవుల రామక్క (58) ఆదివారం(22న) గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కుటుంబ సభ్యులు తొలుత హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. వైద్యుల సూచనతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఐదు రోజుల వ్యవధిలోనే తల్లీ, కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

లబ్ధిదారులకు భూ పంపిణీ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రామన్నగూడెం వాసుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రామన్నగూడెం వాసులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో 1998 సంవత్సరంలో నాటి ప్రభుత్వం ఇంటి స్థలాలు లేని పేదల కోసం భూమి కొనుగోలు చేసి పట్టాలిచ్చారే తప్ప భూమి ఇవ్వలేదని, వారందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, నెల్లికుదురు మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు మాట్లాడారు. ఇంటి స్థలాల పంపిణీపై అనేక మార్లు ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టా పొందిన ప్రతీ ఒక్కరికి స్థలాన్ని కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బాబుగౌడ్, నర్సయ్య, మైస రాములు, బండి సోమయ్య, సైదమ్మ, జయమ్మ, ప్రభాకర్, పద్మ, వెంకటయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బినామీ పట్టాలు రద్దు చేయాలి

- పలిమెల భూములను సందర్శించిన ప్రజా సంఘాల నేతలు



భూముల వద్ద మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రం శివారులో బినామీ పేర్లతో ఉన్న పట్టాలను రద్దు చేసి అసలైన రైతులకు ఇవ్వాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. పలిమెల మండల కేంద్రంలోని సిమెంటుకు కంపెనీకి రిజిస్ట్రేషన్ అయిన భూములను వారు సోమవారం పరిశీలించారు. రైతుల భూములను అక్రమంగా పట్టా చేసుకోవడమే కాకుండా డెక్కన్ సిమెంట్ కంపెనీకి గోప్యంగా 102 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయడం దారుణమన్నారు. 2008 నుంచి ఇక్కడి ప్రజలకు నాయకులు పట్టాలు చేస్తామనడం తప్ప చేసిందేమీ లేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు దీనిని రాజకీయ కోణంగా చూడకుండా రైతులకు మేలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)- లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్, యూఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాబు యాదవ్, దయ్యం పోశయ్య, కిరణ్ కారు, వెంకటేశ్ కుమ్మరి, శ్రీనివాస్, మధునయ్య, లచ్చయ్య, సీపీఐ(ఎంఎల్) జిల్లా కమిటీ సభ్యులడు గంధం శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుద్దారం గ్రామంలో భర్త, అత్త వేధింపులకు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బుద్దారం గ్రామానికి చెందిన సంపసాల మాధవి ఆదివారం రాత్రి ఆమె భర్త రైల్వే ఉద్యోగి సంపసాల రామకృష్ణ, అత్త లాలమ్మ వేధింపులు గురిచేయడంతో మాధవి పురుగుల మందు ఉదయం తాగి ఇంట్లో పడుకుంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్పృహ కోల్పోయిన మాధవిని చూసి, బంధువులు గార్ల ప్రభుత్వ ఆస్పత్రి తరలించి ప్రాథమిక చికిత్స జరిపించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడంతోపూర్తి వివరాలుతెలియాల్సిఉంది.

గంజాయి పట్టివేత

డోర్నకల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరిసీతారామ రాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడకు చెందిన కిముడు గోపి అనే వ్యక్తి డోర్నకల్ రైల్వేస్టేషన్ ఏరియాలో బ్యాగుతో సంచరిస్తున్నాడు. అక్కడ ఉన్న పోలీసులు అనుమానం వచ్చి, అతడి బ్యాగును తనిఖీ చేయగా అందులో సుమారు 7కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి తరలిస్తున్న కిముడు గోపిని అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



డోర్నకల్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టును చూపుతున్న పోలీసులు

తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్



మంగపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని తొండ్యాల లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కబ్బాక శ్రావణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) 9వ రాష్ట్ర మహాసభలు ఏటూరునాగారంలో జరగ్గా జాతీయ కన్వీనర్ రమణల లక్ష్మయ్య సమక్షంలో ఈ మేరకు ఎన్నుకున్నారు.

ల్యాబ్‌టెక్నిషియన్ పోస్టుకు మెరిట్ లిస్టు సిద్ధం

నెహ్రూసెంటర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఫైనల్ జాబితా సిద్ధం చేసినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో గుండాల మురళీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లాలోని బ్లడ్‌బ్యాంకుల్లో పనిచేసేందుకు ఖాళీగా ఉన్నఒక ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఫైనల్ మెరిట్ జాబితాను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.mahabubabad.telangana.gov.in లో పొందపరచడం జరిగిందని తెలిపారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి 1.3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసినట్లు చెప్పారు. అభ్యర్థులకు సంక్షిప్త సమాచారం కోసం ఎస్ఎంఎస్‌ల ద్వార తెలియజేసినట్లు చెప్పారు. మంగళవారం (నేడు) ఉదయం 10 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.

తుడుందెబ్బ నాయకుల ఆందోళన

- ఐటీడీఏ భవనం పైకెక్కి నిరసన
- సీఆర్టీల జనరల్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన సీఆర్టీల జనరల్ నోటిఫికేషన్‌ను రద్దుచేసి కొత్తదానిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ నేతలతు డిమాండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్‌ను తొలగించాలని కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం భవనం పైకెక్కి సోమవారం నిరసన తెలిపారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట 163వ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈసందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసె బాలకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా డిప్యూటీ డైరెక్టర్ పోచం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. ఆదివాసీల హక్కులను హరించే విధంగా ఆయన వ్యవహరిస్తున్నారని, ఆయన్ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 29 శాఖల్లో 100 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు రావాలని, సీఆర్టీ నోటిఫికేషన్‌ను పూర్తిగా ఆదివాసీ అభ్యర్థులచే పూర్తి చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపును ఐటీడీఏ ద్వారా చేపట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ వలసలను అరికట్టాలని, గిరి వికాసం పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవ నిర్మాణ సేనా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి, తుడుందెబ్బ నాయకులు దబ్బకట్ల శ్రీకాంత్ వంక నరేష్, ఎట్టి రాజేష్, ఉపాధ్యాయ సంఘం నాయకులు మైపతి సంతోష్, విద్యార్థి సంఘం నాయకులు కొర్నిబెల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయ భవనం ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

వినతులు సమర్పించిన గిరిజనులు



దర్బార్‌లో డీడీ పోచానికి వినతులు సమర్పిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనులు వినతులు సమర్పించారు. డిప్యూటీ డైరెక్టర్ పోచంకు తమ సమస్యలను విన్నవించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 11 మంది తమ సమస్యలను డీడీ దృష్టికి తీసుకెళ్లారు. మల్లూరులోని శ్రీ హేమచల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో చేపట్టే అభివృద్ధి పనులను పెసా గ్రామసభ తీర్మానంతోనే చేపట్టాలని మల్లూరుకు చెందిన తాటి విజయ్ వినతి పత్రం అందించారు. తన కూతురు వికలాంగురాలని, ఐటీడీఏ ద్వారా నాలుగు చక్రాల స్కూటీని ఇప్పించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బానోతు సరోజ వేడుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వాటికి బిల్లులు మంజూరు చేయాలని గోవిందరావుపేట మండలానికి చెందిన ఈర్ల పావులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు, ఏపీవో సంతోష్ పాల్గొన్నారు.

సోది చెబుతానమ్మా.. సోది..

- సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన



'సోది చెబుతానమ్మ సోది' అంటూ వినూత్న నిరసన

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం వినూత్న తరహాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పనితీరును ఎండగట్టేలా ఓ మహిళా ఉద్యోగిని 'సోది చెబుతానమ్మా.. సోది..' అంటూ నాటిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర ఉద్యోగుల సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు చల్లా సునీత మాట్లాడుతూ 18 ఏళ్లుగా తాము సమగ్ర శిక్షాలో సేవలందిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మర్శించారు. తమగోడును అర్థం చేసుకున్న రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇస్తూ టీ తాగే సమయంలో రెగ్యులర్ చేసే ప్రక్రియ పూర్తిచేస్తానని అన్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ఆ మాటే ఎత్తడం లేదని అన్నారు. ఇప్పటికైనా తమ డిమాండ్‌ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాంద్‌పాషా, వేణు, సుమలత, శైలజ, మహేశ్వరి, ఈశ్వరి, నరేష్, కనకలక్ష్మి, శ్రీలత, రజిత, నిర్మల, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ములుగులో వంటావార్పు

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా ఉద్యోగులు ములుగులో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 14వరోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సమ్మె శిబిరం వద్ద రోడ్డుపై ఉద్యోగులు వంటావార్పుతో వినూతన్న నిరసన చేపట్టారు. అనంతరం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని, సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ప్రతి ఉద్యోగికి జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్యబీమా రూ.5లక్షలు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 61ఏళ్లు నిండినవారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడియా కుమార్, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, సభ్యులు సుజాత, రమేష్, సమన్వయకర్తలు రాజేశ్వరి, స్పెషలాఫీసర్లు జయ, వసంతలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6900	3000
పల్లికాయ (పచ్చిది)	5350	4500
కందులు	-	-
పెసళ్లు	7612	4000
పత్తి	6970	5800
పసుపు (కాడి)	11002	10235
పసుపు (గోల)	10952	9565
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16000	12000
తేజ ఏసీ	15200	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341ఏసీ	13500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటింగ్ అర్జెంటుగా కావలెను. జీతం : 8,000/-, 10,000/- సంప్రదించండి: 8688072125
AJW-199495

FUNCTION HALL FORSALE
★ కాజీపేట, విష్ణుపురిలో గల 490 చ.గజాలలో నిర్మించబడిన మంచి రన్నింగ్ కండీషన్‌లో ఉన్న మినీ ఫంక్షన్ హాల్ అవసర నిమిత్తం అతి తక్కువ ధరలో అమ్మబడును. సంప్రదించండి: 8106016221
AJW-226289

CHANGE OF NAME
★ I, PINGILI KARNAKAR (Old Name), H.No: 1-75, Chowllapally, Athmakur, Hanumakonda,T.G., Have Changed My Name from PINGILI KARNAKAR to PINGILI KARNAKAR REDDY (New Name) S/o. PINGILI RAVINDER REDDY in all my Records
AJW-226293

PLOT FOR SALE
★ ఇయర్ ఎండింగ్ ఆఫర్ కొలనుపాక ఫామ్‌ల్యాండ్ వేంచర్‌లో సగం ధరకే కేవలం (3,50,000) వేలకే ఒక గుంట ప్లాట్లు అమ్మబడును. సంప్రదించండి: 9573735007
AJW-5755

FLAT FOR SALE
★ అపార్ట్‌మెంట్ అమ్మబడును. ఫ్లాట్ నెం. 304,1200 Sft క్రిష్టల్ గార్డెన్ పక్కన, తిలక్ రోడ్ వరంగల్ సంప్రదించవలసిన ఫోన్.నెం : 9440280112
AJW-226401

HOUSE FOR SALE
★ కేవలం రూ॥ 26 లక్షలకే డబుల్ బెడ్ రూం హౌస్ E.M.I పద్ధతిలో అమ్మబడును. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. సంప్రదించండి: 9573689941.
AJW-226291

అమ్మకానికి కలదు
★ Restaurant/హోటల్ అమ్మకానికి కలదు కిట్స్ కాలేజి పక్కన, ఎర్రగట్టు గుట్ట. సంప్రదించవలసిన ఫోన్. నెం : 9281474365
AJW-5756

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

3+2 స్కీం కలదు

సిరులు కురిపించే మహోగని

- రంగును బట్టి కలపకు మార్కెట్లో డిమాండ్
- కిలో ధర రూ. 2 వేల నుంచి రూ. 2500 వరకు
- పడవలు, సంగీత వాయిద్యాలు, ఔషధాల తయారీకి వినియోగం

'డబ్బుల చెట్ల' పెంపకం చేపట్టిన పాలకుర్తి మండల రైతులు



కోతులబాదులో రైతు రాములు పెంచుతున్న చెట్లు

పాలకుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో అమ్మనో.. నాన్ననో.. డబ్బులు అడిగినప్పుడల్లా డబ్బులేమైన చెట్లకు కాస్తున్నాయా? అంటుంటారు. చెట్లకు డబ్బులు కాయకపోయినప్పటికీ.. సిరులు కురిపించే చెట్లు ఉన్నాయి. అలాంటి చెట్లను పెంచాలనాన్న.. సిరులు సొంతం చేసుకోవాలన్నా.. చేయాల్సింది ఒకటే. మనకున్న స్థలంలో అది కొద్దిపాటిదైనా ఆ మొక్కలను నాటి.. 12ఏళ్ల సాకితే చాలు అవే ధనవంతులను చేస్తాయి. ఆ చెట్ల ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. ఎందుకంటే వాటికున్న విలువ అలాంటింది. ఇంతకీ ఆ చెట్టేంటంటా.. మహోగని చెట్లు. డబ్బుల చెట్టుగా చెప్పుకొంటున్న ఆ చెట్లను పాలకుర్తి మండలంలోని బమ్మెర, కోతులబాద్ గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులు పెంచుతున్నారు. బమ్మెరకు చెందిన నర్సింహారెడ్డి పదెకరాల్లో, కోతులబాదుకు చెందిన మరో రైతు చురకంటి రాములు నాలుగు ఎకరాల్లో ఈ చెట్లను వేశారు. హైదరాబాద్ నుంచి మూడేళ్ల క్రితం మొక్కలు (చతుర్వేద) కంపెనీకి చెందిన ఎకరానికి 50 మొక్కల చొప్పున 400 మొక్కలు కొనుగోలు చేశారు. ఒక్కో మొక్క రూ.40 నుంచి రూ.200వరకు ధర ఉండగా.. ఎకరంలో మొక్కలు నాటేందుకు రూ.50వేల నుంచి రూ. 60 వేలు ఖర్చు అవుతుంది. 9 అడుగులకు ఒక మొక్క చొప్పున ఈ మొక్కలు నాటాలి. మూడు నెలలకోసారి ఎకరానికి ఒక బస్తా డీఏపీ, యూరియాను చల్లాలి. ప్రభుత్వం ఈ మహోగని చెట్ల పెంపకానికి ఎలాంటి సబ్సిడీ ఇవ్వలేదు. డ్రిప్ సాయంతో నీటిని ఎక్కువగా అందించాలి. ముఖ్యంగా వేసవిలో నీటిని ఎక్కువగా అందిస్తే చెట్లు ఏపుగా పెరగడానికి దోహదపడుతాయి. ఈ క్రమంలో సదరు రైతులు ఇప్పటి వరకు ఎకరానికి రూ.1లక్ష చొప్పున ఖర్చు చేశారు. ఈ చెట్లు పరిపక్వం చెందడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఐదేళ్లకోసారి విత్తనాలను ఉత్పత్తి చేస్తాయి. హైదరాబాద్, మహారాష్ట్రలో లభించే ఈ మహోగని చెట్లను పెంచిన రైతులు 12 ఏళ్లలో లక్షాధికారులు అవుతారని చెబుతున్నారు.

మహోగని కలప, వినియోగం..

మహోగని కలప సముద్రాల్లో పడవలకు, సంగీత వాయిద్యాలకు విగ్రహాల తయారీలోనూ, వాటర్ క్రాఫ్ట్ అలంకార ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తారు. అంతే కాకుండా విత్తనాలను కొన్ని ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ముఖ్యంగా షుగర్, క్యాన్సర్, బీపీ లాంటి రుగ్మతల నివారణకు వాడే వైద్యంలో ఈ ఔషధాలను ఉపయోగిస్తారని చెబుతున్నారు. ఈ చెట్ల ఆకులు వ్యవసాయ పురుగు మందులుగా ఉపయోగిస్తారని కూడా చెబుతున్నారు. దీని ఆకులు పెద్దవిగా ఉంటాయని, 40 మిల్లీ మీటర్ల పొడవు వరకు మెరుస్తూ ఉంటాయి. సబ్బులు, పెయింట్ లాంటి తయారీలో కూడా మహోగని చెట్ల నుంచి తీసిన నూనెలను వినియోగిస్తారు. ఈ చెట్టుకు సంబంధించిన ప్రతీ భాగం ఏదోఒక విధంగా ఉపయోగపడుతుంది.

గుట్టల ప్రాంతాల్లో కాకుండా..

ఈ మహోగని చెట్లు గుట్టల ప్రాంతాల్లో కాకుండా అన్ని నేలల్లో సాగుచేసుకొవచ్చు. ఈ చెట్టు కలప రంగును బట్టి మార్కెట్లో గిరాకీ ఉంటుంది. ఎరుపు రంగులో ఉన్న కలప ధర క్యూబిక్ ఫీట్‌కు రూ.1,300 నుంచి రూ. 2,500 వరకు మార్కెట్లో పలుకుతుంది. ఒక్కో చెట్టు 60 నుంచి 80 అడుగులు పెరుగుతుంది. దీనిని బట్టి చూస్తే ఈ చెట్టు 40క్యూబిక్ అడుగులు పెరుగుతుంది. క్యూబిక్ ఫీట్‌కు ధర రూ. 1,500 అనుకున్నప్పటికి ఒక చెట్టు రూ. 60 వేల వరకు అమ్ముడవుతుంది. ఈ చెట్ల పెంపకంపై ఆసక్తి చూపేందుకు రైతులు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు.



మహోగని చెట్ల పెంపకంతో భారీ లాభాలు గడించొచ్చు

మహోగని ఆకులను మందుల తయారీకి ఉపయోగిస్తారు. క్యాన్సర్, షుగర్ లాంటి మాత్రల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ చెట్ల పెంపకం వల్ల ఆర్థికంగా అధిక లాభాలు గడిస్తారు. కానీ అందుకు 12 సంవత్సరాల సమయం పడుతుంది. ఆ తర్వాత ఎకరం, రెండెకరాలు సాగు చేసిన లక్షల్లో ఆదాయం ఉంటుంది. రైతులు ఇలాంటి చెట్లను సాగు చేసేందుకు దృష్టి పెట్టాలి. ఈ కలపను పడవల తయారీకి కూడా ఉపయోగిస్తారు.

- కాక రవిదౌర, ఫారెస్టు బీట్ ఆఫీసర్ పాలకుర్తి



ఇప్పటి వరకు రూ.4లక్షల చేశా

మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి మహోగని మొక్కలు తెచ్చి నాలుగు ఎకరాల్లో నాటాను. నాటేందుకు, యూరియా, కూలీల ఖర్చుతో పాటు నీటి కోసం డ్రిప్ పైపులు కూడా తీసుకువచ్చాను. మూడు నెలలకు ఒక సారి డీఏపీ, యూరియా చల్లుతున్నా. ఇప్పటి వరకు అన్ని ఖర్చులు చూసుకుంటే రూ.4లక్షలు ఖర్చు చేశాను. ఈ చెట్లు అమ్మకానికి రావడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఆదాయం బాగానే వస్తుందని ఆశాభావంతో ఉన్నా.

- చురకంటి రాములు, కోతులబాదు, పాలకుర్తి మండలం



12 ఏళ్ల తర్వాత ఆదాయం

కొత్త రకమైన పంట అని మహోగని చెట్లను పది ఎకరాల్లో సాగుచేశా. హైదరాబాద్ నుంచి ఒక్కో మొక్క రూ.100చొప్పున కొనుగోలు చేసి నాటించాను. ఇప్పటి వరకు రూ.6లక్షలు ఖర్చు చేశా. నెలకు ఒకసారి కూలీలతో చెట్లు మొదట్లో ఉన్న గడ్డిని తొలగించాలి. డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నాం. ఇంకా ఏడు సంవత్సరాలు వరకు ఈ పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఆ తర్వాతే ఆదాయం ఎంత వస్తుందని తెలుస్తుంది.

- ముస్కు నర్సింహారెడ్డి, బమ్మెర మండలం పాలకుర్తి

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



- కక్షపూరితంగా నిర్మాణం ఆలస్యం చేశారు..
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆస్పత్రిని సందర్శించిన మాజీ మంత్రి హరీ‌ష్‌రావు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మాజీ మంత్రి హరీ‌ష్‌రావు, బీఆర్ఎస్ నేతలు

వరంగల్ మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో పేద రోగుల వైద్య సేవల కోసం నిర్మించతలపెట్టిన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీ‌ష్‌రావు ఆరోపించారు. వరంగల్ సెంట్రల్ జైలు ప్రాంగణంలో 24 అంతస్థులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మాజీ మంత్రి హరీ‌ష్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీ‌ష్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు 84శాతం పూర్తి అయ్యాయని, కేవలం 16శాతం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలు పూర్తవుతున్నప్పటికీ పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. కక్షపూరితంగా నిర్మాణం ఆలస్యం చేస్తున్నారని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని కోరారు. పేదలకు సూపర్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ వరంగల్ కేంద్ర కారాగారంలో 24 అంతస్థుల్లో ఆస్పత్రి పనులు ప్రారంభిస్తే.. వాటిని పూర్తి చేయాల్సిన రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 2024 జూన్ వరకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి కావాలని ప్రతిపాదనలు చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి గాలికి వదిలారని విమర్శించారు. 14 అంతస్థుల్లో హాస్పిటల్, మరో 10 అంతస్థుల్లో అడ్మినిస్ట్రేషన్ భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం సంకల్పంతో ముందుకు వెళితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను దోచుకునే పనిలో ఉందన్నారు. కేవలం కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో మల్టీ సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారని హరీ‌ష్‌రావు విమర్శించారు.



ఆస్పత్రిని నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీ‌ష్‌రావు

ఎంజీఎం ఆస్పత్రిలో రోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీ‌ష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంపాటు ఓర్పుతో వ్యవహరించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులను తొక్కి సీఎం అయ్యాడని, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడమే వారి పనిగా పెట్టుకున్నట్లు మాజీ మంత్రి టి.హరీ‌ష్‌రావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'బ్లాక్‌బెర్రీ'ని సందర్శించిన మంత్రి సీతక్క

దీవిలో పర్యాటకుల సౌకర్యాలు పరిశీలన

మేడారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం అటవీ ప్రాంతం మొండ్యాలతోగు పరిసరాల్లోని బ్లాక్ బెర్రీ దీవిని రాష్ట్ర పంచాయితీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ములుగు కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాలతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ ఐలాండ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి ట్రయల్ రన్ చేశారు. కనులవిందు కలిగే అడవి మధ్యలో బ్లాక్ బెర్రీ దీవిలో వసతులు, సౌకర్యాలు ఉన్నాయని మంత్రి అన్నారు. కలెక్టర్ క్రూషల్ నిధులతో అటవీశాఖ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో పకృతిని గుర్తించామని, ఈ ఐలాండ్ త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. పస్రా తాడ్వాయి 163 జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలో ఉండడం పర్యాటకులకు అందుబాటులో ఉందన్నారు. ఐలాండ్ అందాలను ప్రతీ ఒక్కరు కుటుంబ సమేతంగా వచ్చి చూడాలని సూచించారు. పిల్లలకు వినోదాత్మకంగా ఆట వస్తువులు, పర్యాటకులు వినోదానికి వాలీబాల్, బ్యాట్‌మెంటన్ క్రీడా ప్రాంగణాలు, ఎత్తైన మంచె, వసతి గృహలు, క్యాంప్‌ఫైర్ ఏర్పాట్లు, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. ఐలాండ్ చుట్టూ వాగు మధ్యలో ఐదెకరాల స్థలంలో ఇసుక దిబ్బగా ఉండి బ్లాక్ బెర్రీ చెట్లతో పకృతి అందాలున్నాయని వివరించారు. ములుగు జిల్లాలో మరిన్ని పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జాదవ్, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ కిసాస్ సెల్ జిల్లా అధ్యక్షుడు బోల్లెపల్లి రాజేందర్ గౌడ్, జిలా నాయకుడు పోషాలు యాదవ్, తాడ్వాయి అటవీశాఖ, పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



క్యాంప్‌ఫైర్ వద్ద మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర, తదితర అధికారులు, నాయకులు

పారా త్రోబాల్ క్రీడాకారిణి భాగ్యను ఆదుకుంటాం

ప్రభుత్వవిప్ బీర్లా ఐలయ్య కురుమ



గూడూరులో భాగ్యను అభినందిస్తున్న బీర్ల ఐలయ్య

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పారా త్రోబాల్ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించిన దివ్యాంగ క్రీడాకారిణి దయ్యాల భాగ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమ, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ భరోసా ఇచ్చారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సభకు ఐలయ్యతో పాటు ఎమ్మెల్యే, తెలంగాణ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క, కురుమ కులస్థుల షెపార్డ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ క్రమంలో భాగ్య గోల్డ్‌మెడల్ సాధించిన విషయాన్ని విమలక్క వేదికపైనున్న వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని గూడూరు శివారు గొల్లగూడెంకు చెందిన దయ్యాల కొమురయ్య- కొమురమ్మ కుమార్తె భాగ్య నిరూపించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించి, అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 5వరకు కాంబోడియాలో జరిగిన అంతర్జాతీ య పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ ను చాటి, బంగారుపతకం సాధించడం హర్షనీయమన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించి, మహబూబాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన భాగ్యను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి, ప్రభుత్వ పరంగా లబ్ధిని చేకూర్చేలా కృషి చేస్తామన్నారు. భాగ్యకు ఇంటిస్థలంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

కేయూలో పీహెచ్‌డీ అశావహుల ఆందోళనలు

- వీసీ చాంబర్‌లో బైఠాయింపు
- అడ్డుకున్న పోలీసులు.. స్టేషన్‌కు తరలింపు..



చాంబర్‌లో బైటాయించి నిరసన చేస్తున్న మంద నరేశ్, అనిల్, తిరుపతి తదితరులు

కేయూ క్యాంపస్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల గొడవ రచ్చకెక్కింది. సోమవారం ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో పీహెచ్‌డీ అశావహులు తమకు అడ్మిషన్లు కల్పించాలని వైస్‌చాన్స్‌లర్ చాంబర్‌లో బైఠాయించారు. తాము అమరణ నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితో తమకు అడ్మిషన్లు ఇప్పించాలని వాగ్వాదం చేశారు. గొడవ విషయం తెలుసుకున్న కేయూ పోలీసులు విద్యార్థులను, అధికారులను సముదాయించారు. దీంతో విద్యార్థులు వర్సిటీ పరిపాలన భవనం గేట్ల వద్ద బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వర్సిటీ పరిపాలన భవనం గేటు వద్ద నిరసన దీక్షల్లో ఉన్న అశా వహులను సీఐ రవికుమార్ దీక్షలు విరమించాలని హెచ్చరించారు. తర్వాత పోలీసు వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మంద నరేశ్, సోరపాక అనిల్, మాలోతు తిరుపతిలు మాట్లాడుతూ.. 2021-22 అడ్మిషన్ల నోటిఫికేషన్‌లో సీట్లు తక్కువగా చూపించి రెండేళ్ల తర్వాత ఉన్న సీట్లను పెంచి రిటైరైన ప్రొఫెసర్లకు గైడ్‌షిప్‌లు కల్పించారని చెప్పారు. దీంతో వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అయితే పీహెచ్ అడ్మిషన్ల కోసం ఎటువంటి సప్లిమెం టరీ నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో మిగతా అభ్యర్థులందరికీ అడ్మిషన్లు లేదని చెప్పారు. వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డిలు తమకు న్యా యం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖఅధికారులకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం వర్సిటీ అధికారులు లేఖలు రాశామని చెప్పినట్లు పీహెచ్‌డీ అశా వహులు తెలిపారు. త్వరలోనే తమకు న్యాయం జరుగుతుందని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేయూ సీఐ రవికుమార్ ఆందోళనకు దిగిన విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్ నేతృత్వంలో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విష్ణు, గౌతమ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కురుమలు కష్టాన్ని నమ్ముకున్నోళ్లు

- ఆయన పేరు శాశ్వతంగా గుర్తుండేలా చర్యలు తీసుకుంటాం
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- గూడూరులో కొమురయ్య విగ్రహావిష్కరణ

రజాకార్లను ఎదిరించిన యోధుడు దొడ్డి కొమురయ్య



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఐలయ్య

గూడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కురుమలు అత్యంత నమ్మకస్తులని, ఎంతో నిజాయితీ పరులని, కష్టాన్ని నమ్ముకున్నోళ్లని ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకురుమ కొనియాడారు. సోమవారం గూడూరు మం డల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. ఊర్లో భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని తాను చెబుతున్నానని, వారికి భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చిస్తారన్నారు. పార్లమెంట్ లోనూ కురుమ సోదరుల ప్రాతినిధ్యం పెంచుతామని వివరించారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా దొరల పెత్తానాన్ని అడ్డుకోవడానికి దొడ్డు కర్రల సంఘం పెట్టి, పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్యని పేర్కొన్నారు. దొరలు, దేశ్‌ముఖ్‌లు, పెత్తదారులకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య అమరత్వం పొందారని, దొరలకు వ్యతిరేకంగా పోరాడటమంటే సులువైన వ్యవహారం కాదన్నారు. బడుగుబలహీన వర్గాల ప్రజలను ఐక్యం చేసి, వెట్టి చాకిరి లాంటి సామాజిక దురాచారాలను ఎదురించిన వీరుడు కొమురయ్య అన్నారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ కళాకారులు ఆలపించిన గీతాలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య వారసుడు దొడ్డి చంద్రం, క్యామ మల్లేశం, చీర భిక్షపతి, చెవేళ్ల సంపత్‌కుమార్, నర్సింహా, కె.శ్రీనివాస్, మంత్రి సుభాష్, ఆరె వీరన్న, చిట్టె వెంకటేశ్వర్లు, ముదురు సాంబయ్య, నూనావత్ రమేష్‌నాయక్, వాంకుడోతు కొమ్మాలు నాయక్, కోరె రాంబాబు, చీర అశోక్, మండల ఉపేందర్, కుండె కిషన్, పోతరాజు రవి, కోరె దేవేందర్, మల్లేష్, శ్రీనివాస్, కుమారస్వామి, అనిల్, బీరయ్య, పాపయ్య, కుమారస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి : విమలక్క



కురుమ కులస్థులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకుని రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. కురుమ కులస్థులు తమ పిల్లలను బాగా చదివించాలని, చదువుతోనే అన్ని సాధ్యమవుతాయన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో న్యాయమైన వాటా కోసం పోరాడాలన్నారు. పాలకవర్గాలు కులాలను విభజించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని, అందరు ఐక్యంగా ఉండి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కురుమ సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ కులస్థుల షెపార్డ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కురుమ సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురైందని చెప్పారు. రాష్ట్రంలో పది శాతం ఉన్న కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. విద్యా, ఉద్యోగం, ఉపాధి అవకాశాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

నమ్మకానికి మారుపేరు

- మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కురుమలు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. నమ్మకానికి మారుపేరు, మృదుస్వభావులు కురుమ సోదరులని, అలాంటి సామాజిక వర్గంనుంచి వచ్చిన పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య. సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపిన వ్యక్తని కొనియాడారు. కురుమల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తనవంతుగా గూడూరులో కురుమ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.



సభలో పాల్గొన్న కురుమలు



కస్తూర్బా విద్యాలయంలో స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

బయ్యారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సూచించారు. సోమవారం కలెక్టర్ మండలంలోని కస్తూర్బా గిరిజన బాలికల విద్యాలయం, ఎస్సీ బాలుర వసతి గృహం, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలతో పాటు బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని డైనింగ్ హాల్, కిచెన్‌హెడ్, క్లాస్, స్టడీ, స్టోర్ రూమ్స్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో రాత్రి సమయంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. భోజనం, వైద్యం తదితర విషయాల్లో పిల్లల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పీహెచ్‌సీల పరిధిలోని క్షేత్ర స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ విజయ ఎంపీడీవో విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ తహసీల్దార్‌తో కొనసాగుతున్న ఇనుగుర్తి

● విద్యుత్ ఏఈ సైతం..

ఇనుగుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటైన ఇనుగుర్తి మండలంలో ఇన్‌చార్జుల పాలన కొనసాగుతోంది. 2022, డిసెంబర్ 4న మండల ఏర్పాటు కాగా, తొలి తహసీల్దార్ అబేద్‌అలీ, 2023, ఫిబ్రవరిలో తహసీల్దార్ సూర్యనారాయణ పనిచేయగా.. కొద్దిరోజులకే ఆయన బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత నెల్లికుదురు తహసీల్దార్ శైలజ ఇన్‌చార్జ్‌గా పనిచేయగా. కొద్ది నెలల తర్వాత కేసముద్రం తహసీల్దార్ దామోదర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. దామోదర్ సెలవుపై వెళ్లగా. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి డిప్యూటీ తహసీల్దార్ ఆకుల రవికి ఇన్‌చార్జ్ బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. తాజాగా మూడు రోజుల క్రితం కేసముద్రం తహసీల్దార్ దామోదర్ విధుల్లో చేరడంతో మళ్లీ ఆయన ఇన్‌చార్జ్ బాధ్యతలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ధరణి భూముల రిజిస్ట్రేషన్, ఆదాయ ధ్రువీకరణపత్రాల జారీ వరకు డిప్యూటీ



తహసీల్దార్ ఆకుల రవికి కేటాయించి, మిగతా తహసీల్దార్ విధులకు ఇన్‌చార్జిగా కేసముద్రం తహసీల్దార్ దామోదర్ వ్యవహరిస్తున్నారు. ఇలా రెండు సంవత్సరాల్లో రెగ్యులర్, ఇన్‌చార్జిలు ఆరుగురు తహసీల్దార్లు మారారు. దీంతో రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసలు తమ తహసీల్దార్ ఎవరనేది తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ప్రభుత్వ, ప్రజల అవసరాలకు రెగ్యులర్ తహసీల్దార్ లేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విద్యుత్ శాఖ ఏఈ శశిధర్ నాలుగు నెలల క్రితం బదిలీపై వెళ్లగా.. కేసముద్రం ఏఈ రాజుకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో విద్యుత్ శాఖకు సంబంధించిన పనులకు ఇన్‌చార్జ్ ఉండడంవల్ల విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కారం కాకుండా జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ తహసీల్దార్, విద్యుత్ ఏఈలను నియమించి ప్రజలకు ఆయా శాఖల నుంచి సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

ఎండీ.రహీం, ఇనుగుర్తి



ఇన్‌చార్జి అధికారులతో ఇబ్బందులు పడుతున్నాం. కార్యాలయానికి ఏదైనా పనికి వెళ్లితే రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జులు వచ్చే వరకు వేచి ఉండాల్సివస్తోంది. అధికారులు రెండు మండలాల్లో పనిచేస్తుండడంతో వారు ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లాల్సివస్తోంది. ఇనుగుర్తిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా రెగ్యులర్ అధికారులను నియమించాలి.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈవో రవీందర్‌రెడ్డి

కొత్తగూడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దాతలు పంపిణీ స్టడీ మెటీరియల్ చదివి పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. కాళోజీ గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ బాధ్యుడైన శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని 10వ తరగతి విద్యారినులకు డీఈవో చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో వెనుకబడిన గిరిజన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గుమ్మడి లక్ష్మీనారాయణ, ఏసీజీఈ మందుల శ్రీరాములు, జీసీడీవో విజయకుమారి, కాళోజీ గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు తోడేటి వెంకన్న, మేడ వెంకటేశ్వర్లు, దేవేందర్‌రెడ్డి, దేవ్‌సింగ్, పూజారి తోలెం వెంకటేశ్వర్లు, రాంబాబు, ఎంఐఎస్ సాగర్ పాల్గొన్నారు.

కలిసి కట్టుగా పని చేద్దాం.. మానుకోటను అభివృద్ధి చేసుకుందాం

(5వ పేజీ తరువాయి)

నివసిస్తున్న కాలనీల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సూచించారు. మానుకోట పట్టణాభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు తెచ్చే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మునిసిపల్ సమావేశానికి ఉన్నతాధికారులు వస్తే సమస్యలు వారి దృష్టికి పోతాయని వారు వచ్చే విధంగా పాలకమండలి ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఇంటిగ్రేటేడ్ మోడల్ మార్కెట్‌ను త్వరగా ప్రారంభించి గాంధీ పార్కును ప్రజా అవసరాలకు వినియోగించు కోవాలన్నారు. సమావేశ ప్రారంభంలో మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి ప్రస్తుత పాలకమండలి హాయంలో చేసిన అభివృద్ధిని వివరించారు.

చర్చ జరిగింది ఇలా..

మహబూబాబాద్ మునిసిపల్ కౌన్సిల్‌లో వార్డు కౌన్సిలర్లు తమ పరిధిలో ఉన్న సమస్యలను సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్‌ను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. జనవరి చివరాంకంలో పాలకమండలి సభ్యుల పదవీ కాలం పూర్తవుతుందని, ప్రతీ వార్డు అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించాలని కోరగా.. రూ.5 లక్షల కేటాయిస్తున్నట్లు చైర్మన్ రాంమోహన్‌రెడ్డి ప్రకటించారు. సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మాట్లాడుతూ పాతబజారులో బస్టాండ్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు అంబేద్కర్ కాలనీ వరకు , కొత్త బజారులో నెహ్రూసెంటర్ నుంచి మంగలి కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరారు. వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు మాట్లాడుతూ మునిసిపాలిటీ నూతన భవనం ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలని అడిగారు. వార్డు కౌన్సిలర్ దండెబోయిన బుజ్జి వెంకన్న మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ సరిగా జరగండ లేదని మండి పడ్డారు. ఆయనకు మద్దతుగా పలువురు వార్డు కౌన్సిలర్ల నిలిచారు. స్పందించిన కమిషనర్ ˆవీందర్ జవాన్లు మార్చి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని సమాధానమిచ్చారు. వార్డు కౌన్సిలర్ నీరజదర్శన్న మాట్లాడుతూ కొత్తబజారులో రైల్వే మూడోలైన్ పనుల నేపధ్యంలో క్యాబిన్ రోడ్ రహదారిని మూసి వేశారని దాని పక్కన ఉన్న రోడ్డును అభివృద్ధి చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విలీన గ్రామాల అభివృద్ధిపై చిన్నచూపు చూస్తున్నారని వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు తీర్మాణాలను ఆమోదించారు. కాగా, గత ప్రభుత్వం హయంలో నిధుల లేమితో అభివృద్ధి పనులన్నీ నత్తనడకన నడుస్తున్నాయని, మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు కూడ పూర్తి కాలేదని ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు జోక్యం చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు పూర్తి చేస్తామని చెప్పారు... చేశారా? అంటూ ఇది రాజకీయ వేదిక కాదని అభివృద్ధి గూర్చి మాత్రమే చర్చించాలన్నారు. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్ధన్, కౌన్సిలర్లు పోతురాజు రాజు, తాళ్లపల్లి జగన్, బానోత్ హరిసింగ్, భూక్య శ్రీను, సలీం, నిమ్మల శ్రీను, మార్నేని శ్రీదేవి, బండి ఇందిర, బోనగిరి గోపిరత్నం, డౌలాగర్ స్వాతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

గార్ల, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో సోమవారం తెల్లవారుజామున వరికోత మిషన్ ఢీకొట్టడంతో పాలవ్యాన్ డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సీతంపేటలోని జిల్లా పరిషత్ స్కూల్ సమీపంలో మూలమలుపు వద్ద వరికోత మిషన్ గార్ల నుంచి బయ్యారం వెళ్తున్న పాలవ్యాన్ వరికోత మిషన్ ఢీకొట్టడంతో వ్యాన్ డ్రైవర్ తేట రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎడమకాలు విరిగిపోవడంలో 108 సహాయంలో క్షతగాత్రుడిని స్థానిక మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై రియాజ్‌పాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంటలో పడి ఎద్దులు మృతి

మెడకు కట్టిన తాళ్లు కాళ్లలో పడటంతో ఘటన



కందికొండలో నీటికుంటలో పడి మృతి చెందిన ఎద్దులు

కురవి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు కళ్ల ఎదుటే తన రెండుఎద్దులు కుంట నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కందికొండలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. కందికొండ నాగుల కుంట శివారులో గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే కోసం మట్టి తోడారు. దీంతో ఆ ప్రాంతంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో ఇటీవల కురిసిన వర్షానికి నీరుపెద్దఎత్తున నిలిచింది. సోమవారం సాయంత్రం రైతు తొడుసు వీరన్న తన ఎద్దులకు నీరు తాగించేందుకు నాగుల కుంట వద్దకు తీసుకువెళ్లాడు. ఎద్దుల మెడకు తాళ్లుకట్టి ఉండడంతో ఎద్దులు కాళ్లుజారి మట్టికోసం తీసిన బొందల్లో పడ్డాయి. ఆ తాళ్లు వాటి కాళ్లలో చిక్కుకోవడంతో నీటిలో మునిగి చనిపోయాయి. రైతు వీరన్న అక్కడే ఉండి ఎద్దులను రక్షించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో రోదిస్తూ ఉండిపోయాడు. కుంటలో మట్టి కోసం గుంతలు తోడిన కాంట్రాక్టర్లే ఘటనకు బాధ్యత వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రైతు వీరన్న మాట్లాడుతూ.. ఎద్దులు చనిపోవడంతో తనకు రూ.21లక్షల నష్టం వాటిల్లిందని, అధికారులు తనను ఆదుకోవాలని రోధించారు.

‘అమిత్‌షా రాజీనామా చేయాలి’

నెహ్రూసెంటర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని చెప్పారు. తక్షణమే దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలన్నారు. పులి శ్రీను, సీహెచ్. రాధ, కుక్కల సుధ, సంధ్య, రమ, బాలరాజు, ఎల్లయ్య, సత్యపాల్, పిచ్చయ్య, నవీన్, భాగ్యరేఖ, విజయ, కళమ్మ, రేణుక, రాధ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజాపాలనపై కళాజాత

నెల్లికుదురు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రజాపాలనపై రామన్నగూడెంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు ఉచిత బస్సు, రైతు రుణమాఫీ, ఆరు గ్యారంటీలపై ఆటపాటలతో గ్రామస్తుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు గిద్దె రామనర్సయ్య, కళాబృందం పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

డోర్నకల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలోని సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రిస్మస్ కానుకలను అందించారు. అనంతరం విద్యార్థుల సమక్షంలో కరస్పాండెంట్ పసాల ఆంటోని, హెచ్‌ఎం ఎలెన్‌రాణిలు కేక్ కట్ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి : షీటీం ఎస్సై

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మహబూబాబాద్‌లో సోమవారం ట్రావెల్ షేప్ యాప్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలలిగిఉండాలని సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకొని క్రమ శిక్షణ, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. మహిళలు ట్రావెల్ షేప్ యాప్ ను ఉపయోగించుకొని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఇట్టి యాప్‌ను ఉపయోగించడం వలన ప్రయాణం సురక్షితంగా ఉంటుందని, అందులో పోలీసులు సాయం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కర్ణాకర్, శివ, షీటీం సిబ్బంది పార్వతి, రమేష్, మంగీలాల్, యుగందర్, ప్రధానోపాధ్యాయుడు మధు పాల్గొన్నారు.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న షీ టీం ఎస్సై సునంద

క్రీడా ప్రాంగణానికి తాళాలు

● ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

తొర్రూరు, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేకంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి అన్నిసౌకర్యాలు కల్పించింది. తొర్రూరు పట్టణంలోని 1వ వార్డు పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో లక్ష రూపాయలు మునిసిపాలిటీ నిధుల నుంచి ఖర్చు చేసి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. కానీ, పాఠశాల హెచ్‌ఎం అనాలోచిత నిర్ణయంతో క్రీడాకారులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం వాలీబాల్ క్రీడాకారులు క్రీడలు ఆడేందుకు అక్కడికి రాగా హెచ్‌ఎం లక్ష్మీనారాయణ పాఠశాల సమయం ముగియగానే ప్రాంగణానికి తాళం వేసుకుని వెళ్లడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్రీడాకారుల కోసం మైదానం ఏర్పాటు చేసి సౌకర్యం కల్పిస్తే తాళం వేయడం ఏమిటని నిరసన వ్యక్తం చేశారు. వెంటనే మునిసిపల్ అధికారులు స్పందించి గేటు తాళం తీయించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రమాకాంత్, బాలు,మహేష్, విక్రమ్ తదితరులు ఉన్నారు.

ఆడపిల్లలను రక్షించండి.. చదివించండి

జిల్లా మహిళా సాధికారిత కేంద్రం స్పెషలిస్ట్ అరుణ

మరిపెడ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, ఆడపిల్లలను రక్షించి, చదివించినట్లయితే వారి కాళ్ల మీద వారే నిలబడతారని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. సోమవారం గుండెపుడి హైస్కూల్‌లో బేటీ బచావో, బేటీ పడావో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. అమ్మాయిలను చదివించినట్లయినట్లతే వారికి ఉన్న హక్కులను సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. ఆడపిల్ల కలిగిన తల్లిదండ్రులు గర్వంగా చెప్పుకునే విధంగా పేరు తీసుకురావాలని కోరారు. బాల్య వివాహాలు గురించి 1098, 181, 100, 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, అరుణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

హెల్త్‌కార్డుల పరిమితిని పెంచాలి

మరిపెడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆల్ పెన్షనర్స్‌కు హెల్త్‌కార్డుల పరిమితిని పెంచాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి సీతారాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం తొర్రూర్ డివిజన్ సమావేశం గాదె అశోక్‌రెడ్డి అధ్యక్షతన మరిపెడ మండల్ పరిషత్ కార్యాలయంలో నిర్వహించగా సీతారాం ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. సంఘం బాధ్యులు వీరన్న, కొమురయ్య, మదార్, కపిల్ రాజు, వెంకటరెడ్డి, రామ్మూర్తి, వాల్య, బ్రహ్మయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పెద్దవంగర, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ సేవలు అభినందనీయమని వడ్డెకొత్తపల్లి ఇన్‌చార్జి హెచ్‌ఎం శేషవల్లి, లయన్స్ క్లబ్ ఎఫ్‌డబ్ల్యూసీ డాక్టర్ వేలూరి శారద అన్నారు. సోమవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వెలిదు సురేష్- సంధ్యారాణి దంపతుల సొంత ఖర్చులతో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్స్, పరీక్షసామగ్రిని అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ అధ్యక్షులు చింతల సురేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలకు రశీదు తప్పని సరి

● ఏడీఏ విజయ్‌చంద్ర

దంతాలపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, విత్తనాల విక్రయంలో ఫర్టిలైజర్ షాపుల యాజమాన్యం తప్పక రశీదులను ఇవ్వాలని ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యాసంగి సాగులో రైతులకు విక్రయించిన విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్స్ వివరాలను షాపుల వారు రిజిష్టర్లలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పదన్నారు. స్థానికంగా పని చేసే ఏవో, ఏఈవోలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవో వాహిని, ఏఈవోలు దిక్షిత్, శిరీష, ఉదయ్ పాల్గొన్నారు.

ఆరో ప్రపంచ తెలుగు మహాసభలకు సత్యనారాయణకు ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం అందినట్లు కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ సోమవారం తెలిపారు. మహబూబాబాద్‌కు చెందిన సత్యనారాయణ మానుకోట రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు, తెలుగు భాష పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. విజయవాడలోని చెరుకూరి రామోజీరావు సభా వేదికపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సాహితీ సంస్థల ప్రతినిధుల సద్నులో పాల్గొనేందుకు తనకు అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.

పీవీ నర్సింహారావు వర్ధంతి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం భారత మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహారావు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌నాయక్ మాట్లాడుతూ నర్సింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో దేశాభ్యున్నతే లక్ష్యంగా పని చేశారని చెప్పారు. తెలంగాణ ప్రాంతం నుంచి అత్యున్నత పదవులు అలంకరించిన మేధావి నర్సింహారావు అని కొనియాడారు. ఓబీసీ సెల్ పట్టణాధ్యక్షుడు లింగాల వీరభద్రం, చెన్న సీతారాములు, మేకల శివ, ఎస్కే. గఫూర్, దుర్గేష్, సంపంగి రాంచంద్రు, కొత్త యుగేందర్, బడేటి కరుణాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి

డోర్నకల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటంలో టీఎస్‌యూటీఎఫ్ ఎప్పుడు ముందుంటుందని ఆ సంఘం డోర్నకల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్‌లు అన్నారు. డోర్నకల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం విద్యావైజ్ఞానిక మహాసభల విజయవంతం కోసంముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు సోమనబోయిన శ్రీనివాస్, సాహెబ్‌అలీ, శంకర్, రాములు, అమీనా, రేణుక, గ్రేసమ్మ పాల్గొన్నారు.

చదువుతో పాటు సాగుపై అవగాహన ఉండాలి

● లెర్నింగ్ ట్రీ పాఠశాల ప్రిన్సిపాల్ సాధనారెడ్డి



సోమ్లాతండాలో మిర్చితోటను పరిశీలిస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు మానవుడు జీవించడానికి కావలసిన ఆహార పదార్థాలను ఎలా పండిస్తారు అనే అంశాలపై అవగాహన కలిగిఉండాలని లెర్నింగ్ ట్రీ పాఠశాల ప్రిన్సిపాల్ యాళ్ల సాధనారెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని లెర్నింగ్ ట్రీ పాఠశాల విద్యార్థులను సోమవారం రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం శివారు సోమ్లాతండా, సికింద్రాబాద్‌తండాల్లో పలు వ్యవసాయ పంటలను పరిశీలించారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయ బృందం రఫియా. ప్రణీత, వైశాలి, నిహారిక ఉన్నారు.

కొత్త రేషన్‌కార్డులను జారీ చేయాలి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాపారావు

కేసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అవసరమయ్యే రేషన్‌కార్డులను జారీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు డిమాండ్ చేశారు. కేసముద్రం విలేజి ఎన్టీఆర్‌నగర్‌లో సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఒక్క రేషన్‌కార్డు సైతం జారీ చేయలేదని విమర్శించారు. కొత్తగా ఎన్నో కుటుంబాలు ఏర్పడ్డాయని, వారి పిల్లలకు పథకాలు అందకుండా పోతున్నాయని తెలిపారు. ఎన్టీఆర్‌నగర్‌లో ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి జల్లె జయరాజు, అల్పుగొండ సావిత్ర, సోమారపు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

‘లోకోమోటివ్ పీవోహెచ్’ ఇవ్వండి

(5వ పేజీ తరువాయి)

ఈ ప్రాంతంలో ఉండడం విశేషం. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటే పీవోహెచ్ ఏర్పాటు సుగమం అవుతుందని ఆశపడుతున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని డంపింగ్ యార్డు సమీపంలో సుమారు 865 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, మరోపక్క డోర్నకల్ జంక్షన్ ప్రాంతంలో కూడా పెద్దఎత్తున రైల్వేతో పాటు ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏదో ఓ చోట పీవోహెచ్ వర్క్‌షాపు ఏర్పాటు చేసినట్లయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభ్యం అవుతాయని చెబుతున్నారు.

అత్యధిక ఆదాయం అందిస్తున్న దక్షిణమధ్య రైల్వే..

దక్షిణమధ్య రైల్వేలో లోకోమోటివ్ పీవోహెచ్ యూనిట్ లేదు. భారతీయ రైల్వేలకు అత్యధిక ఆదాయం అందిస్తున్న వాటిలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ద్వితీయస్థానంలో ఉంది. దీంతో లోకోమోటివ్ పీవోహెచ్ ఏర్పాటు అవసరమని మహబూబాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు. డోర్నకల్ జంక్షన్‌లో 90వ దశకం వరకు స్టీమ్ ఇంజన్ లోకో షెడ్డు ఉండేది. రైల్వేలో ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల శకం ప్రారంభమైన తర్వాత దశల వారీగా స్టీమ్ ఇంజన్‌లను తొలగించారు. దీంతో డోర్నకల్‌లోని స్టీమ్ ఇంజన్ షెడ్డును మూసివేసి ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని వేరే ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో లోకోమోటివ్ పీవోహెచ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భారతీయ రైల్వేలలో ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న లోకోమోటివ్‌లు (రైలు ఇంజన్లు) మహారాష్ట్రలోని భూసావల్, బెంగాల్‌లోని కాంచర్‌పార, ఖరగ్‌పూర్, తమిళనాడులోని పెరంబూర్, ఉత్తరప్రదేశ్‌లోని చార్‌బాగ్, గుజరాత్‌లోని దౌహద్‌లో ఉన్నాయి. పెరుగుతున్న అవసరాల రీత్యా ఒడిశా రాష్ట్రంలోని ధనకుని, గుజరాత్‌లోని దౌబాయిలో పీవోహెచ్ యూనిట్లను నూతనంగా ఏర్పాటు చేస్తున్నారు. నూతనంగా లోకోమోటివ్ పీవోహెచ్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని భావిస్తున్న.. రైల్వేశాఖ మహబూబాబాద్ జిల్లాలో పీవోహెచ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి గిరిజన ప్రాబల్య ఈప్రాంత నిరుద్యోగులకు తీపి కబురు అందించాలని కోరుతున్నారు.

మంత్రి, ఎంపీ, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు..

మానుకోట రైల్వేట్రాక్ అనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో పీవోహెచ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తులను అందజేశారు. మహబూబాబాద్ సమీపంలోని తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ కేంద్రంగా లోకోమెటివ్ పీవోహెచ్ ఏర్పాటుకు రైల్వే స్థలం అనుకూలంగా ఉందని బీజేపీ నాయకులు రైల్వే మంత్రికి విన్నవించారు. మరోపక్క మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్‌కు కాంగ్రెస్ సీనియర్ నేతలు జిల్లాలో పీవోహెచ్ యూనిట్ ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తులు అందజేశారు. అంతేకాకుండా మహబూబాబాద్ జిల్లాకు చెందిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు ఈ దిశగా స్పందించి కేంద్రాన్ని ఒప్పించాలని రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు తాజాగా వినతిపత్రం సమర్పించారు. సదరు ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించడంతో మహబూబాబాద్‌కు మంచిరోజులు రానున్నాయని యువత ఆనందం వ్యక్తం చేస్తోంది. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో పీవోహెచ్ యూనిట్ లేని కారణంగా స్థానికంగా ఇంజనీరింగ్ చదివిన గ్రాడ్యుయేట్లు వేలాది మందిని తమిళనాడుకు పంపుతున్నారు. ఇక్కడి మేధోసంపత్తి పక్క రాష్ట్రానికి తరలిపోతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పీవోహెచ్ యూనిట్‌ను తేస్తే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వేలో నూతన అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉంది.